సాక్షి

మహబూబాబాద్

బుధవారం | 16 | ఆగస్టు | 2023



హామీల అమలులో బీఆర్‌ఎస్‌ విఫలం
హామీల అమలులో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య అన్నారు.
- 9లో▸



రేషన్‌కార్డులు ఇవ్వాలి
అర్హులకు నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని సీపీఐ జిల్లా నాయకుడు అజయ్‌ సారథిరెడ్డి అన్నారు.
- 9లో▸

గరిష్టం/కనిష్టం
$31.9^0 / 22.2^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

రేపు టీటీడీ నీతి కథల పోటీలు

మహబూబాబాద్‌ రూరల్‌: టీటీడీ ఆధ్వర్యంలో నీతి కథల పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి, టీటీడీ స్థానిక ధర్మాచార్యులు ఇమ్మడి రవికుమార్‌ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్‌ హైస్కూల్‌ ఆవరణలో విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో 'కథ చెబుతారా ఊ కొడతాం' నీతి కథల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భాగవతం, రామాయణం, పంచతంత్ర కథలు, నీతి కథలు విద్యార్థులు చెప్పవచ్చన్నారు. 10 సంవత్సరాలలోపు విద్యార్థులు మొదటి గ్రూపు, 10నుంచి 15 సంవత్సరాలలోపు విద్యార్థులను రెండో గ్రూపుగాను విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపి అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొనేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

పార్థివదేహం అందజేసేందుకు ఒప్పందం



నెహ్రూసెంటర్‌: మహబూబాబాద్‌కు చెందిన సీనియర్‌ సిటిజన్‌ కోట రాంరెడ్డి తన మరణాంతరం పార్థివదేహాన్ని ప్రభుత్వ మెడికల్‌ కళాశాలకు దానం చేయడానికి ఒప్పంద పత్రాన్ని మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటేశ్వర్లుకు మంగళవారం అందజేశారు. తన భౌతికదేహాన్ని కళాశాలకు అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రాంరెడ్డిని ప్రిన్సిపాల్‌ సన్మానించారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: ఐక్యఉద్యమాల ద్వారానే ఉపాధ్యాయుల పెండింగ్‌ సమస్యలు పరిష్కారం అవుతాయని ఉమ్మడి వరంగల్‌, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్‌ కార్యాలయంలో జరిగిన హనుమకొండ, వరంగల్‌ జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కేజీబీవీల్లోని ఉద్యోగుల, ఉపాధ్యాయులకు బేసిక్‌ పే ఇవ్వాలన్నారు. బదిలీల, పదోన్నతుల, పండితుల కోర్టు కేసులకు సంబంధించి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్‌, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సదాశివరెడ్డి, వరంగల్‌ జిల్లా జనరల్‌ సెక్రటరీ బద్దం వెంకటరెడ్డి, ఉభయ జిల్లాల కమిటీ బాధ్యులు సి.సుజన్‌ప్రసాద్‌రావు, సిహెచ్‌.లింగారావు, కె.రమేష్‌, సీఎస్‌ఆర్‌ మల్లిక్‌, ఎస్‌.శ్రీనివాస్‌, డి.రవీందర్‌, కె.సదానంద్‌, కె.నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌ 4న సీఎం రాక

హసన్‌పర్తి: సెప్టెంబర్‌ 4న ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు హనుమకొండ జిల్లాకు రానున్నారు. గ్రేటర్‌ వరంగల్‌ పరిధిలోని దేవన్నపేట–ఉనికిచర్ల ప్రాంతాల్లో సభ నిర్వహించడానికి అనువైన ప్రాంతాలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరిశీలించారు. ఆ రోజు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ సందర్భంగా సభా వేదిక, హెలిపాడ్‌ స్థలం, పార్కింగ్‌ స్థలాలను మంత్రి ఎర్రబెల్లి పరిశీలించారు. మంత్రి వెంట ఆర్డీఓ రమేష్‌, మాజీ సర్పంచ్‌ చుంచు రవీందర్‌, ఆత్మ డైరెక్టర్‌ భూపాల్‌, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నేడు కేయూ బంద్‌

కేయూ క్యాంపస్‌: తెలంగాణ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ ఈనెల 16న తెలంగాణ స్టేట్‌ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం పిలుపు మేరకు బుధవారం కాకతీయ యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆ అసోసియేషన్‌ జాక్‌ రాష్ట్ర కన్వీనర్‌ డాక్టర్‌ చిర్ర రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 100 రోజులుగా వివిధ నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, దీక్షలు చేపట్టామని ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీలోనూ పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లకు అకుట్‌, పార్ట్‌టైం అధ్యాపక, వివిధ విద్యార్థి సంఘాలు మద్దతునివ్వాలని కోరారు.



కేసీఆర్‌ పాలన స్వర్ణయుగం

పేదలకు అందుతున్న స్వాతంత్య్ర ఫలాలు

- తొమ్మిదేళ్లలో మానుకోట ఎంతో అభివృద్ధి
- అందుబాటులో మెరుగైన వైద్యం, పెద్ద చదువులు
- రైతుల సంక్షేమమే సీఎం లక్ష్యం
- స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి సత్యవతిరాథోడ్‌





పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సత్యవతి, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మంత్రి



జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్‌, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌, కలెక్టర్‌, ఎస్పీ

సాక్షి, మహబూబాబాద్‌: పరాయి పాలనలో అభివృద్ధికి నోచుకోని మానుకోట తొమ్మిది సంవత్సరాల్లో బంగారు కోటగా మారింది. సీఎం కేసీఆర్‌ పాలన మానుకోటకు స్వర్ణయుగం వంటిది అని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

పెద్ద చదువులు, ఖరీదైన వైద్యం

గతంలో ఉన్నత చదువులు చదవాలంటే వరంగల్‌, హైదరాబాద్‌ వంటి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదని, అలాంటి మానుకోటకు ఇప్పుడు ప్రభుత్వ కళాశాలలు వచ్చాయని అన్నారు. గత ఏడాది వైద్య కళాశాల, నర్సింగ్‌ కళాశాల ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం తరగతులు జరిగాయని, ఇప్పుడు మరో బ్యాచ్‌ వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని 330 పడకలకు అప్‌గ్రేడ్‌ చేసి వైద్య కళాశాలకు అనుబంధంగా మార్చామని వెల్లడించారు. అదే విధంగా మహబూబాబాద్‌ మండలం మల్యాలలో ఉద్యానవన డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటితోపాటు ప్రభుత్వ ఇంజనీరింగ్‌ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఇటీవల జీఓ విడుదల చేసిందని, ఈ సంవత్సరం నుంచే ఐదు బ్రాంచ్‌ల్లో 300 మంది విద్యార్థులకు ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. వీటితోపాటు ప్రభుత్వ గిరిజన మహిళా గురుకుల కళాశాల ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది నుంచి గిరిజన బిడ్డలకు ఎంబీఏ చదువు కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. మహబూబాబాద్‌తో పాటు గూడూరు, గార్లలో సీహెచ్‌సీలు ఉన్నాయని, కొత్తగా మరిపెడ, తొర్రూరులో 100 పడకల ఆస్పత్రులు మంజూరైనట్లు చెప్పారు. బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల ఏర్పాటుతో పేదల ముంగిటికి ప్రభుత్వ వైద్యం వచ్చిందని మంత్రి వివరించారు. తెలంగాణ డయాగ్నోస్టిక్‌ హబ్‌ ద్వారా 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని అన్నారు. వీటితోపాటు కంటి వెలుగు పథకం ద్వారా మరోసారి కంటి అద్దాలు, ఆపరేషన్‌ చేయిస్తున్నామని చెప్పారు.

గిరిజన సంక్షేమం..

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయని మంత్రి సత్యవతిరాథోడ్‌ అన్నారు. 10శాతానికి రిజర్వేషన్‌ పెంచడం వల్ల గిరిజన బిడ్డలకు విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రాధాన్యత లభించిందని చెప్పారు. గిరిజన తండాలు, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేశామని, రూ.22కోట్లతో జీపీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. జిల్లాలో మరో 26 తండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అన్ని గిరిజన తండాలు, గూడేలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కోసం కోట్లాది రూపాయల కేటాయించామని అన్నారు. జిల్లాలో పోడు చేసుకుంటున్న 24,181 మంది రైతులకు 67,730 ఎకరాలకు పట్టాలు అందజేశామని వెల్లడించారు. వారికి ఈ ఏడాది నుంచే రైతు బంధు పడుతుందని అన్నారు.

మహిళా, శిశు సంక్షేమం..

జిల్లాలో మహిళా, శిశు సంక్షేమానికి కృషి చేస్తున్నామని, 1,437 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. వీటితోపాటు బరువు, ఎత్తు తక్కువగా ఉన్నవారికి కోసం న్యూట్రిషన్‌ ప్లస్‌తో కొత్త పథకం అమలు చేస్తున్నామని అన్నారు. చంటి బిడ్డల ఆరోగ్యం కోసం కేసీఆర్‌ కిట్‌ అందజేస్తున్నామని, దీంతో మాతా, శిశుమరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించామని వివరించారు. సఖీ కేంద్రం ద్వారా మహిళలకు ఆశ్రయం కల్పించడం, కౌన్సెలింగ్‌ ఇచ్చి మనోధైర్యాన్ని నింపుతున్నామని అన్నారు. అదేవిధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకం ద్వారా పేదింటి ఆడ బిడ్డ పెళ్లికి రూ.100,116 అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు.



వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నాం..

రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు ప్రవేశపెట్టామని మంత్రి సత్యవతి అన్నారు. నీటి వనరులను పెంచామని, కాల్వల ద్వారా ఎస్సారెస్పీ నీటితో చెరువులను నింపుతున్నామన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ అందిస్తున్నామని, దీంతో జిల్లాలో రైతులు 4లక్షలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారని అన్నారు. ఇందులో 2లక్షలకుపైగా వరి సాగు చేస్తున్నారన్నారు. ఈ పంటను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా పంటల పెట్టుబడి రైతు బంధు, ప్రమాదబీమా, రైతు బీమా అందిస్తూ రైతు పక్షపాతిగా పాలన సాగుతుందని అన్నారు. రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ అవుతుందని అన్నారు. వీటితోపాటు దళిత బంధు, బీసీ, మైనార్టీ బంధు పథకం ద్వారా పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్‌ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ బిందు, కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌, రాజకీయ ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంస పత్రాలు - 8లో▸

ర్యాలీని విజయవంతం చేయాలి

- మంత్రి సత్యవతిరాథోడ్‌

మహబూబాబాద్‌: జిల్లా కేంద్రంలో బుధవారం 5వేల మంది విద్యార్థులు, యువతతో నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని మంత్రి సత్యవతి రాథోడ్‌ పిలుపునిచ్చారు. మానుకోటలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి నెహ్రూసెంటర్‌ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ ఆశీస్సులతో మానుకోట ఎడ్యుకేషన్‌ హబ్‌ గా మారిందన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, ప్రీమెట్రిక్‌, పోస్ట్‌ మెట్రిక్‌ విద్యాలయాలతో పాటు మెడికల్‌ కాలేజీ, నర్సింగ్‌ కాలేజీ, జేఎన్‌టీయూ అనుబంధంగా ఇంజనీరింగ్‌, ఎంబీఏ కాలేజీలు వచ్చాయన్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా నిర్వహించే ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్‌ కవిత, ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ బిందు, మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ మహ్మద్‌ ఫరీద్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించిన కలెక్టర్‌



జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్‌, అధికారులు

మహబూబాబాద్‌: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ శశాంక జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ డేవిడ్‌, జిల్లా స్థాయి అధికారులతో పాటు కలెక్టరేట్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పోరుబాట..

నేటి నుంచి రెండో ఏఎన్‌ఎంల నిరవధిక సమ్మె

- జిల్లాలో 159 మంది ఉద్యోగులు
- రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌



నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు (ఫైల్‌)

నెహ్రూసెంటర్‌: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఏళ్ల నుంచి రెగ్యులర్‌ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నామని.. అయినా తమకు ఉద్యోగ భద్రత లేదని వాపోతున్నారు. రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 14వ తేదీన సమ్మె నోటీసులను అధికారులకు అందజేశారు.

2008 నుంచి కాంట్రాక్ట్‌ పద్ధతిలోనే..

జిల్లా వ్యాప్తంగా 159 మంది రెండో ఏఎన్‌ఎంలను 2008వ సంవత్సరంలో కాంట్రాక్ట్‌ పద్ధతిన నియామకం చేశారు. కాగా 15 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ రెగ్యులర్‌ ఉద్యోగులతో పాటు అలవెన్స్‌లు, టీఏ, డీఏ రావడం లేదు. ఉద్యోగ భద్రత, విధి నిర్వహణలో మృతి చెందితే కనీసం ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

పెరిగిన పనిభారం..

పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై అప్రమత్తం చేస్తూ ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. దీనికి తోడు ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో 38 రికార్డులను నమోదు చేస్తున్నారు. దీంతో పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో భాగస్వాములమై విజయవంతం చేస్తున్నామని రెండో ఏఎన్‌ఎంలు అంటున్నారు.

వారి ప్రధాన డిమాండ్లు..

- రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి.
- విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలి.
- ఎక్స్‌గ్రేషియా, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలి.

రెగ్యులరైజ్‌ చేయాలి..



15ఏళ్లుగా కాంట్రాక్ట్‌ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ రద్దు చేసి రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయాలి. ఇప్పటి వరకు వివిధ రకాలుగా నిరసనలు తెలిపాం. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట పడుతాం.
– అశ్విని, రెండో ఏఎన్‌ఎం, మహబూబాబాద్‌

ఉద్యోగ భద్రత కల్పించాలి



అరకొర వేతనాలతో విధులు నిర్వహిస్తూ పనిభారం పెరిగి సతమతమవుతున్నాం. ప్రభుత్వం మా సేవలను గుర్తించి రెగ్యులర్‌ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.
– దార జ్యోతి, రెండో ఏఎన్‌ఎం, మహబూబాబాద్‌

నిరవధిక సమ్మె..



15 ఏళ్లుగా కాంట్రాక్ట్‌ పద్ధతిలో రెండో ఏఎన్‌ఎంలు కీలకమైన వైద్య సేవలందిస్తున్నారు. వారిని రెగ్యులర్‌ చేయాలని వివిధ దశల్లో పోరాటాలు నిర్వహిస్తున్నాం. రెండో ఏఎన్‌ఎంలకు ఏఐటీయూసీ మద్దతుగా నిలబడి పోరాడుతాం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే నేటి నుంచి జరగనున్న నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ పూర్తి మద్దతు ఉంటుంది.
– రేషపల్లి నవీన్‌,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహబూబాబాద్‌ అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మంత్రి సత్యవతిరాథోడ్‌ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులను ఘనంగా సన్మానించారు.



స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌

సాంస్కృతిక కార్యక్రమాలు

మానుకోట మోడల్‌ స్కూల్‌, జెడ్పీఎస్‌ఎస్‌ బాలికల పాఠశాల, కేజీబీవీ, నర్సింహులపేట మోడల్‌ స్కూల్‌, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులు పలు జాతీయ గీతాలకు నృత్యాలు చేశారు. డీఈఓ రామారావు, జీసీడీఓ విజయకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

శకటాల ప్రదర్శన..


స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని పలు శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. ఎస్సీ సంక్షేమ శాఖ, సమగ్ర బాలల పరిరక్షణ పథకం ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. డీఆర్‌డీఓ, పురపాలక శాఖ, విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుబీమా, రైతుబంధం శకటాలను ప్రదర్శించారు. మిషన్‌ భగీరథ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఆధ్వర్యంలో మిషన్‌ భగీరథ పథకం, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు.




స్టాళ్లను సందర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

స్టాళ్ల సందర్శన..


పలు పథకాలకు సంబంధించిన స్టాళ్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేశారు. వాటిని మంత్రి సత్యవతిరాథోడ్‌, ఎంపీ మాలోత్‌ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఆంగోత్‌ బిందు, కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



విద్యార్థుల విన్యాసాలు



వైద్యారోగ్య శాఖ శకట ప్రదర్శన

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎంపీ మాలోత్‌ కవిత

మహబూబాబాద్‌: జిల్లా వ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బానోత్‌శంకర్‌నాయక్‌ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ రామ్మోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, చిట్యాల జనార్దన్‌, గద్దె రవి, గోగుల రాజు తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్‌ కవిత జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, మహబూబ్‌ పాషా, బోడ లక్ష్మణ్‌ నారాయణరావు, శ్రీనివాస్‌, దాసరి రావిష్‌, బూర్ల ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్‌

జిల్లా కోర్టు, పోలీసు కార్యాలయాల్లో..

మహబూబాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రంలోని కోర్టు, జిల్లా పోలీసు కార్యాలయాల్లో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్‌, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ జాతీయ పతాకాలను ఎగువేశారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ శరత్‌ చంద్రపవార్‌

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



మౌత్‌వాష్‌, పేస్టులు అందజేస్తున్న డాక్టర్‌ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ విజయటాకీస్‌ రోడ్డులోని ఎస్‌వీఎస్‌ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్‌ గిరిధర్‌రెడ్డి పాల్గొని పలువురికి పరీక్షలు చేశారు. ఉచితంగా పేస్టులు, మౌత్‌వాష్‌లు, మందులు పంపిణీ చేశారు. దంత సంరక్షణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అలరించిన ఆర్య నాటిక



నాటికలోని ఓ సన్నివేశం

హన్మకొండ కల్చరల్‌ : 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్‌ ఓరుగల్లు శారదా నాట్యమండలి ఆధ్వర్యంలో సోల్జర్‌ షఫీ మహమ్మద్‌ రచించి దర్శకత్వం చేసిన ఫ్రీడమ్‌ ఫైటర్‌ నీరా ఆర్య నాటిక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మంగళవారం రాత్రి పోతన విజ్ఞాన పీఠంలో నాట్యమండలి అధ్యక్షుడు జీఎస్‌ శర్మ ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనలో సురభి హారిక, రేలారే శాలిని, జూలూరి నాగరాజు, సుధాకర్‌, అశోక్‌కుమార్‌, మధు, విజయారాజ్‌, సురేష్‌, లింగమూర్తి, రవికుమార్‌, శివ, సంగీతం సురభి నాగరాజు, లైటింగ్‌, సెట్టింగ్‌ సురభి సంతోష్‌ అందించారు. అనంతరం విశ్రాంత లెఫ్టినెంట్‌ కల్నల్‌ రాజశేఖర్‌, ఎక్స్‌సోల్జర్‌ మనోజ్‌ ప్రభాకర్‌, బిట్ల వేణుగోపాల్‌, సుబేదార్‌ మల్లేశాన్ని సన్మానించారు.

ముగిసిన కార్తీక్‌ అంత్యక్రియలు



కార్తీక్‌ (ఫైల్‌)

టేకుమట్ల : మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్‌ కొలుగూరి కార్తీక్‌ (31) శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా, ఆర్మీ అధికారులు ఉత్తరాఖండ్‌ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కార్తీక్‌ పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో మండల కేంద్రానికి తరలించారు. మంగళవారం సాయంత్రం కొనసాగిన కార్తీక్‌ అంతమయాత్ర రాత్రి 9.30లకు ముగిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కడసారి వీడ్కోలు పలికి కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, కార్తీక్‌ పార్థివదేహం మండల కేంద్రానికి చేరుకోగానే భార్య ప్రవళిక బంధువులతో కార్తీక్‌ కుటుంబ సభ్యులకు గొడవ మొదలైంది. ఎస్సై సుధాకర్‌ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

ఉత్తములకు ప్రశంస పత్రాలు



మంత్రి సత్యవతి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న డీడబ్ల్యూఓ నర్మద

స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని ఉత్తమ సేవలు అందించిన పలు శాఖల ఉద్యోగులు, అధికారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. మంగళవారం మానుకోటలోని ఎన్టీఆర్‌ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి సత్యవతిరాథోడ్‌, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌, కలెక్టర్‌ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ చేతుల మీదుగా ఉత్తములకు ప్రశంసపత్రాలు అందజేశారు. – సాక్షి, స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌,మహబూబాబాద్‌



సత్యనారాయణ, లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ | సురేందర్‌, మిషన్‌ భగీరథ | సమ్మిరెడ్డి, ఐబీ ఈఈ | రాజ నరేందర్‌, ఏడీ అగ్రికల్చర్‌



నీలోఫర్‌, సీడీపీఓ, గూడూరు | విజయ్‌, డీఈ, ఎన్పీడీసీఎల్‌ | విజయ్‌, ఆర్టీసీ డీఎం | నరేష్‌ రెడ్డి, సీసీ, అడిషనల్‌ కలెక్టర్‌ | అనిల్‌కుమార్‌, పీసీ | అంజయ్య, పీసీ, బీడీ టీం | సారయ్య ఏఓ(టెక్‌) | రామారావు, ఏఓ | హరిప్రసాద్‌, ఎంపీఓ | శ్రీనివాస్‌, డీఆర్‌డీఏ డీపీఎం | శ్యామ్‌గుప్తా, డిప్యూటీ ఈఈ | శివకుమార్‌, ఏఈఈ



డాక్టర్‌ క్రాంతి కుమార్‌ | డాక్టర్‌ రమేష్‌ | సునీల్‌కుమార్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ | నాగేశ్వరరావు, జోనల్‌ ఇన్‌స్పెక్టర్‌ | ఎం.రవీందర్‌, డిప్యూటీ జైలర్‌ | రామకృష్ణ, జూనియర్‌ అసిస్టెంట్‌ | రంజిత్‌, తొర్రూరు మున్సిపాలిటీ | గోపికృష్ణ, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ | యాకలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌ | హేమలత, వెటర్నరీ ఆఫీసర్‌ | మౌనిక, ఎక్సైజ్‌ ఎస్సై | హరిత, సీనియర్‌ అసిస్టెంట్‌



డాక్టర్‌ ప్రత్యూష, మెడికల్‌ ఆఫీసర్‌ | డాక్టర్‌ సుధీర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్‌ | నాగమణి సీనియర్‌ అసిస్టెంట్‌ | రాఘవపాల్‌రెడ్డి, మరిపెడ ఫైర్‌ స్టేషన్‌ | జి.రవీందర్‌, ఎంపీడీఓ | రాధిక, ప్రొఫెసర్‌, గైనిక్‌ డాక్టర్‌ | .రాజేష్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ | సందీప్‌, ఏఈఈ | సందీప్‌, సర్వే ల్యాండ్‌ రికార్డ్స్‌ | రజిత, జేపీఎస్‌, ఏపూరు | ఎండీ సందాని, ఆఫీస్‌ సబార్డినేట్‌ | బి.రాణి, టెక్నికల్‌ అసిస్టెంట్‌, డీఆర్డీఏ



విజయప్రతాప్‌, ఏఆర్‌ డీఎస్పీ | సతీష్‌, సీఐ | విజయేందర్‌, పీసీ, తొర్రూరు | సత్యనారాయణ, ఆఫీస్‌ సబార్డినేట్‌ | నాగేశ్వరరావు, ఆఫీస్‌ సబార్డినేట్‌ | అరుణ్‌, హార్టికల్చర్‌ ఆఫీసర్‌ | శివకుమార్‌ | శంకర్‌ | శ్రీనివాస్‌ | ప్రవీణ్‌ | శ్రీకాంత్‌ | యుగంధర్‌

పాముకాటుతో యువకుడి మృతి

- ఇబ్రహీంపూర్‌లో ఘటన



మహేష్‌ (ఫైల్‌)

రఘునాథపల్లి: పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దొరగొల్ల ఎల్లయ్య, లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు మహేష్‌ (27), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రులకు చేదోడువాడుగా ఉండే మహేష్‌ మంగళవారం గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. గ్రామ పెద్ద చెరువు కట్ట చివరన గొర్రెలను మేపుతుండగా మహేష్‌కు పాము కాటువేసింది. తనకు పాము కాటువేసినట్లు స్నేహితులకు ఫోన్‌ చేసి తెలిపాడు. ఘటనాస్థలిలోనే అస్వస్థతకు గురైన మహేష్‌ను స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే మహేష్‌ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చిన్నారిని ఢీకొన్న కారు

- పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నందిని

గూడూరు: జాతీయ రహదారి దాటుతున్న ఓ చిన్నారిని కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆ బాలిక పరిస్థితి విషమంగా మారింది. మండలంలోని మర్రిమిట్టకు చెందిన చింత నర్సయ్య, హేమలత దంపతుల కూతురు నందిని ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది. మధ్యాహ్నం సమయంలో ఎన్‌హెచ్‌కు పక్కన ఉన్న పాఠశాల నుంచి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో నర్సంపేట వైపు నుంచి వస్తున్న భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన కారు బాలికను ఢీకొంది. దీంతో గ్రామస్తులు వెంటనే బాలికను వరంగల్‌లోని ఓ ఆసత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కారుతో పాటు అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

‘తూర్పు’ నుంచి గణేశ్‌కు అవకాశం కల్పించాలి

- మంత్రి కేటీఆర్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘాల నాయకులు



మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

రామన్నపేట/హన్మకొండ: వరంగల్‌ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థిగా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు గణేష్‌కు ప్రాతినిథ్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌, పరిశ్రమ శాఖ మంత్రి కేటీఆర్‌కు బ్రాహ్మణ సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలో ఓ ప్రైవేట్‌ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్‌ను బ్రాహ్మణ సంఘాల నాయకులు కలిశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాజకీయపరంగా సముచిత స్థానం కల్పించాలని, బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, వరంగల్‌ జిల్లాలో బ్రాహ్మణ జాతిని ఏకతాటి పై తీసుకువచ్చిన వద్దిరాజు గణేష్‌కు వరంగల్‌ తూర్పు టికెట్‌ కేటాయించాలని కోరారు. సీఎం కేసీఆర్‌ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగు ఉపేంద్రశర్మ, జగన్‌మోహన్‌ శర్మ, లక్ష్మణ్‌ శర్మ, వెంకటేశ్వరరావు, సత్యమోహన్‌, శ్రీనివాసాచారి, పి.శ్రీనివాసరావు, శ్రీకాంత్‌, శరత్‌, శిరీష్‌, నాగేందర్‌, జయప్రసాద్‌ రావు, శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మధుకర్‌ మృతదేహం

ఎల్కతుర్తి : అప్పులు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గోపాల్‌పూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన పెండ్యాల మధుకర్‌ (35) వ్యవసాయం, కుటుంబ అవసరాల నేపథ్యంలో విరివిగా అప్పులు చేశాడు. ఎలా తీర్చాలని కొంత కాలంగా మదనపడుతున్నాడు. ఈ విషయమై సోమవారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మధుకర్‌ వ్యవసాయ పొలం వద్ద మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్‌ తెలిపారు.

సమాజహితానికి కవులు కృషి చేయాలి

- డాక్టర్‌ అంపశయ్య నవీన్‌



కవి సమ్మేళనంలో పాల్గొన్న అంపశయ్య నవీన్‌

హన్మకొండ కల్చరల్‌ : సమాజహితానికి కవులు కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్‌ అంపశయ్య నవీన్‌ అన్నారు. మంగళవారం హనుమకొండ పద్మాక్షి దేవాలయం రోడ్‌లోని డాక్టర్‌ జగదీష్‌బాబు ఆస్పత్రి సమావేశపు హాల్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మతసామరస్యం, జాతీయ సమైక్యతకు ప్రతీకగా గంగా, జమునా, తెహజీబ్‌ పేరుతో కవిసమ్మేళనం, ముషాయిరా నిర్వహించారు. వరల్డ్‌ పీస్‌ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్‌ సిరాజుద్దీన్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంపశయ్య నవీన్‌ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 40 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు. అనంతరం నిర్వాహకులు సిరాజుద్దీన్‌, రవికుమార్‌ కవులను సన్మానించారు. సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్‌ సమన్వయకర్తగా వ్యవహరించారు.

కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యం..

- శిల్పాల ప్రాంగణంలో ఎగరని జాతీయ జెండా
- పర్యాటకుల అసహనం



మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో బోసిపోయి కనిపిస్తున్న స్తంభం

ఖిలా వరంగల్‌ : కేంద్ర పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖిలావరంగల్‌ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని స్తంభం వెలవెలబోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్తంభంపై స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరలేదు. కేవలం రాతి కోట ఉత్తర ద్వారా సమీపంలోని కోట బురుజుపై పురావస్తుశాఖ అధికారి తాత్కాలిక జెండా చేతపట్టి ఫొటోలు దిగారని పలువురు జాతీయవాదులు ఆరోపిస్తున్నారు. కాగా, మంగళవారం వరంగల్‌ ఉమ్మడి జిల్లాతోపాటు దేశ, విదేశీయులు పర్యాటకులు భారీ సంఖ్యలో చేరుకోగా బోసిపోయి కనిపించిన ఎత్తయిన జెండా స్తంభాన్ని చూసిన వారు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర పురావస్తుశాఖ.. రాష్ట్ర సూపరింటెండెంట్‌ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

పంద్రాగస్టు స్పెషల్‌ టిఫిన్‌

- త్రివర్ణ ఇడ్లీ..పూరీ



ఉడిపి హోటల్‌లోని త్రివర్ణ ఇడ్లీ

మూడు రంగుల్లో పూరీ

పరకాల: ఒక్కొక్కరు ఒక్కో రకమైన దేశాభిమానం ప్రదర్శిస్తుంటారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని శ్రీరామ ఉడిపి హోటల్‌ యాజమాని జాతీయ పతాకాలు, బెలూన్లతో అలంకరించడంతోపాటు మూడు రంగుల ఇండ్లీ..పూరీలతో కస్టమర్లను ఆకట్టుకున్నాడు. పంద్రాగస్టు స్పెషల్‌ టిఫిన్‌ అంటూ కస్టమర్లు హాయిగా తినేశారు.

కాంట్రాక్ట్‌ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయాలి



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్‌ ఏఎన్‌ఎంలు

ఎంజీఎం : వైద్య ఆరోగ్యశాఖలో 20 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్‌ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ యునైటెడ్‌ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం వరంగల్‌, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాల ఎదుట ఏఎన్‌ఎంలు సమ్మె ప్రారంభించారు. సమ్మెలో పాల్గొన్న యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్‌ మాట్లడుతూ రెండో ఏఎన్‌ఎంలు, అర్బన్‌ హెల్త్‌ సెంటర్స్‌ ఏఎన్‌ఎంలు, యూరోపియన్‌ ఏఎన్‌ఎంలు, ఇతర అన్ని స్కీంలలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు రెండు దశాబ్దాలుగా రెగ్యులర్‌ కాకుండా, సమాన పనికి సమాన వేతనం అమలు కాకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ జూలై 31న కమిషనర్‌, ప్రిన్సిపల్‌ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సమ్మెకు అన్ని ట్రేడ్‌, క్యాడర్‌ యూనియన్లు పద్ధతుగా నిలిచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు ప్రభావతి, సరోజ, నర్మద, విజయలక్ష్మి, రోజీ, వరలక్ష్మి, సునీత, విజయ, రజిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో జెండావందనం..



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, పాల్గొన్న న్యాయమూర్తులు, హనుమకొండ జిల్లా బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు శ్యామ్‌ సుందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు. -వరంగల్‌ లీగల్‌



కోర్టులో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వరంగల్‌ జిల్లా న్యాయమూర్తి కె.రాధాదేవి, న్యాయమూర్తులు, వరంగల్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్‌, కార్యదర్శి యాకస్వామి, సిబ్బంది తదితరులు. -వరంగల్‌ లీగల్‌

హసన్‌పర్తి ఎంపీపీ సునీతపై హత్యాయత్నం

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఎంపీపీ కేతపాక సునీతపై హత్యాయత్నం జరిగింది. గ్రామానికి చెందిన సమీప బంధువు కోర్నెల్‌ ఆమెపై కత్తితో దాడికి యత్నించారు. మండలంలోని మల్లారెడ్డిపల్లిలో సోమవారం రాత్రి కోర్నెలు మేనకోడలు శారీ ఫంక్షన్‌జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కుటుంబీకులతో పాటు ఆమె బంధువులు కూడా వెళ్లారు. అయితే అక్కడ కోర్నెల్‌కు ఎంపీపీ బంధువుకు గొడవ జరిగింది. దీనిని అవమానకరంగా భావించిన కోర్నెలు తన కుటుంబసభ్యులతో కలిసి ఎంపీపీ ఇంటికి వచ్చి ఆమెపై కత్తితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్యగొడవ జరిగింది. ఈ ఘటనలో కోర్నెలుకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎం తరలించారు. కాగా, ఎంపీపీ సునీతతో పాటు ఆమె భర్త రాజు మరో ఆరుగురు తనపై దాడి చేశారని కోర్నెల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, తనపై కత్తితో దాడి చేశారని కోర్నెల్‌తో పాటు మరో ఇద్దరిపై ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.